క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులతో రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు (టౌన్): ఈనెల 26, 27 తేదీల్లో నరసరావు పేటలో జరగనున్న రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. బుధవారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు మొమెంటోలు, మెడల్స్ అందజేశారు. ఆట్యా, పాట్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరత్నమయ్య, న్యాయవాది దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ గోడకు ఆనుకుని ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎం కేంద్రం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయస్సు ఉండి ఛామనఛాయ వర్ణం, మాసిన గడ్డంతో ఉన్నాడు. ముదురు నీలం రంగు టీషర్టు, ముదురు నీలం రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. అతని వివరాలు తెలిసినవారు 91211 01061 లేదా 08518-277187కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ శేషయ్య విజ్ఞప్తి చేశారు.

ఓర్వకల్ రాక్ గార్డెన్ అద్భుతం

కర్నూలు కల్చరల్: ఓర్వకల్ రాక్ గార్డెన్ అద్భుతం అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం అనంతపురం నుంచి కర్నూలు చేరుకున్న మంత్రి దుర్గేష్ ఓర్వకల్ రాక్ గార్డెన్‌ను సందర్శించారు. హరితా రూమ్స్, సహజ సిద్ధంగా ఏర్పడ్డ ఆకృతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాక్ గార్డెన్ ప్రకృతి సౌందర్యానికి ఆలవాలంగా నిలుస్తోందన్నారు. సహజ సిద్ధమైన కొండల మధ్య ఉన్న రాతివనం, చెరువు, లక్షల ఏళ్ల క్రితం ఏర్పడ్డ రాతి ఆకృతులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయన్నారు. ఇక్కడ బాహుబలి, డాకు మహారాజ్ తదితర సినిమా షూటింగ్‌లు జరిగాయని రాబోయే రోజుల్లో రాక్ గార్డెన్‌లో మరిన్ని షూటింగ్‌లు జరుగుతాయన్నారు. పర్యాటకులు రాక్ గార్డెన్స్‌ను సందర్శించేలా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీశైలం, అహోబిలం, బెలూం గుహలు, యాగంటి తదితర ప్రదేశాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనాలివ్వాలి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబు ముస్లింలకు న్యాయం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి మోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనాలను వెంటనే ఇవ్వాలన్నారు. 9 నెలల నుంచి గౌరవ వేతనాలు అందక ఇమామ్‌లు, మౌజమ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, నాయకులు సయ్యద్ ఖాద్రిపాషా, వలీబాషా, అబ్దుల్ పాల్గొన్నారు.

నేడు క్విజ్ పోటీలు

కర్నూలు సిటీ: స్థానిక విద్యానగర్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో గాడిచర్ల సర్వోత్తమరావు జయంతి, మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏపీ గ్రంథాలయ సంఘం, గాడిచర్ల ఫౌండేషన్ సాహితీ సదస్సు సంయుక్తంగా విద్యార్థులకు ఈ నెల 11, 13వ తేదీల్లో క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాహితీ సదస్సు కమిటీ సభ్యులు కేవీ సుబ్బలక్ష్మి, మాంటిస్సోరి స్కూల్ హెచ్‌ఎం కె.స్వర్ణలత ప్రసంగించారు. క్విజ్ విజేతలకు 14వ తేదీన పింగళి సూరన్న తెలుగుతోటలో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కోడుమూరు రూరల్: గూడూరులోని ఎరువుల దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి విశ్వనాథ్ మండల వ్యవసాయాధికారి దస్తగిరిరెడ్డితో కలిసి ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువుల స్టాక్‌కు సంబంధించిన రికార్డులు సరిగా లేనందున సత్యనారాయణ ట్రేడింగ్ కంపెనీలో రూ.1,89,000 విలువ చేసే 9 టన్నుల ఎరువులు, రామక్రిష్ణ ట్రేడర్స్‌లో రూ.3,28,000 విలువ చేసే 10 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు.

రైతు బేజారు !

- దళారుల గుప్పిట్లో రైతుబజారు
- అధికారులను శాశించే స్థాయికి ఆగడాలు
- ఒక్కొక్కరు రెండు స్టాళ్ల అక్రమణ
- నిజమైన రైతులకు నిత్యం అవమానాలే
- నిబంధనలు అమలైతే ఒట్టు
- బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోని వైనం



రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరల విక్రయం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దళారులను కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్న ఎస్టేటు అధికారికి ఎదురు తిరుగుతున్నారు. నువ్వు ఏమి చేసుకుంటావో.. చేసుకో.. మాకు పరపతి ఉంది.. నిన్ను ఎక్కడ పెట్టాలో మాకు తెలుసుంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. అధికారి పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. రైతుబజారులో బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు. తూకాలు సక్రమంగా ఇవ్వరు అంటూ చాలా రోజులుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని సి.క్యాంపు రైతు బజారు రాష్ట్రంలోని ప్రధాన రైతు బజార్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇక్కడ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలే దళారులను ప్రోత్సహిస్తున్నారు. నేతల అండదండలు ఉండటంతో దళారులు చెలరేగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న వారిలో అత్యధికులు దళారులే కావడం గమనార్హం. దళారులు రైతు బజారులోకి రైతులను రానివ్వరు. ఎవరైన పండించిన కూరగాయలను అమ్ముకుందామంటే స్థలమే దొరకదు. నిజమైన రైతులకు అడుగడుగునా అడ్డంకులే. దళారుల ఆగడాలకు తట్టుకోలేక సరుకు తెచ్చుకున్న రైతులు దళారులకు ఏదో ఒక ధరకు విక్రయించుకొని పోవాల్సిందే. నిజమైన రైతులకు మూలన మరుగుదొడ్ల దగ్గర చోటు చూపించి అక్కడ అమ్ముకోమని చెబుతారు. చివరకు సరుకు అమ్ముడు పోకపోతే దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని బయటికి పోవాల్సిందే. దళారులను తట్టుకోలేక రైతులు బయటకు వెళ్లక తప్పడం లేదు.

బోర్డుపై రాసిన ధరలను పట్టించుకుంటే ఒట్టు

రైతుబజారులో బోర్డుపై రాసిన ధరలను పట్టించుకున్న పాపన పోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బోర్డుపై రాసిన ధరలకే విక్రయించాలని మైకు ద్వారా అనౌన్స్‌మెంటు ఇస్తున్నా పట్టించుకునే వారు లేరు. దీనికి తోడు తూకాల్లోను చేతివాటం చూపడం ఎక్కువైంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో వినియోగదారులతో రైతుబజారు కిటకిటలాడింది. బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోవడం లేదంటూ, తూకాల్లో దగా చేస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రైతుబజారులో నిజమైన రైతులు ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉండవు. దళారులే ఉండటం వల్ల ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం రైతుబజారులో కూరగాయలు అమ్ముకోవాలంటే పొలం ఉండి కూరగాయలు సాగు చేస్తుండాలి. కూరగాయలు సాగు చేస్తున్నట్లుగా హార్టికల్చర్ కన్సల్టెంటు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంది. అటువంటి రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తారు. వారు మాత్రమే కూరగాయలు అమ్మకోవాల్సి ఉంది. ఇది రైతుబజారులో ఏ మాత్రం అమలు కావడం లేదు. సెంటు పొలం లేని దళారులు ఇటు రైతుల నుంచి అటు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి సరుకు కొని తెచ్చుకొని అమ్ముకుంటున్నారు.

నిజమైన రైతుకు అవమానం

కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామానికి చెందిన రహిమాన్ అనే రైతు క్యాబేజీ సాగు చేశారు. పండించిన క్యాబేజీని రైతుబజారులో అమ్ముకునేందుకు వరుసగా రైతుబజారుకు వస్తున్నారు. పలుబ స్టాల్లో క్యాబేజీ తెచ్చిన రైతును పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. రెండు, మూడు రోజులు తిరిగినప్పటికి స్థలం ఇవ్వలేదు. ఎక్కడైన కూర్చుంటే దళారులు ఈ స్థలం మాది అని లేపుతున్నారు. చివరికి వినియోగదారులు వెళ్లని చోటు మరుగుదొడ్ల వద్ద స్థలం చూపించి అక్కడ కూర్చొని క్యాబేజీ అమ్ముకోమన్నారు. రోజంతా కూర్చున్నా 10 కిలోల క్యాబేజీ కూడా అమ్ముకోలేకపోయారు. నిజమైన రైతులకు ఇలా అవమానం జరుగుతుంటే, దళారులు స్టాళ్లలో అన్ని రకాల కూరగాయలు పెట్టుకొని, బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పెత్తనమంతా దళారులదే !

రైతుబజారులో పెత్తనమంతా దళారులదే. క్రిష్ణగిరి, బాపురం, ఆత్మకూరు, బస్తిపాడు, పడిదెంపాడు, భూపాల్‌నగర్, నన్నూరు ప్రాంతాలకు చెందిన కొంతమందికి సెంటు భూమి లేకపోయినప్పటికీ రాజకీయ అండదండలతో రైతు బజారులో తిష్ట వేశారు. కొంతమందికి భూములున్నా కూరగాయల సాగే ఉండదు. కనీసం 30 మంది దళారులు రెండేసి స్టాళ్లను అక్రమించి హవా నడిపిస్తున్నారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికీ స్టాళ్లు ఉన్నాయంటే దళారులు రైతుబజారులో ఏ స్థాయిలో పాతుకుపోయారో తెలుస్తోంది. భార్య, భర్త, కూతురు, కుమారుడు ఇలా అందరు స్టాళ్లు దక్కించుకున్నారు. వీరికి భూములు ఉన్నాయంటే సెంటు కూడా లేదు. వీరు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి కూరగాయలు తెచ్చుకొని రైతుబజారులో అమ్మకాలు సాగిస్తున్నారు. కనీసం 100 మందికిపైగా దళారులు రైతుబజారులో తిష్ట వేయడం వల్ల రైతులకు న్యాయం జరగడం లేదు. మూడు, నాలుగు నెలల క్రితం దళారులందరినీ బయటకి పంపినప్పటికీ రెండు, మూడు రోజుల్లోనే రాజకీయ నేతల సిఫార్సులతో తిరిగి ప్రవేశించి రైతుబజారు అధికారి, సిబ్బందిపైనే ఎదురు తిరుగుతున్నారు. దళారుల ఏరివేతకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, దళారులకు రాజకీయ నేతల అండదండలు ఉండటంతో రైతుబజారు అధికారి, సిబ్బంది అంటే లెక్కలేనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర ప్రాంతాల నుంచి కొందరు రైతులు కూరగాయలు, ఆకు కూరలు తెచ్చుకుంటే లోనికి రానివ్వకుండా బయటనే దళారులు కొంటారు.

ఏటీల జీతభత్యాలు సరిచేయాలి



డీఎంఈని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రవ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న అనెస్తీషియా టెక్నీషియన్ల (ఏటీ)కు జీతభత్యాల విషయంలో ఉన్న తేడాలను సరిచేయాలని డీఎంఈ డాక్టర్ రఘునందన్‌ను ఏపీ ఏటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. కర్నూలుకు చెందిన డీఎంఈ డాక్టర్ రఘునందన్‌కు ఇటీవల పదోన్నతి రావడంతో ఆయన్ను బుధవారం విజయవాడలో సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ కొన్ని చోట్ల ఏటీలకు ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్ ఇవ్వడం లేదని, జీతభత్యాల్లో తేడాలు చూపుతున్నారన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.దినేష్, ట్రెజరర్ వినోద్, సహ కార్యదర్శి సురేష్, అమర్ ఉన్నారు.

12న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 12వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సాఫ్ట్‌బాల్ క్రీడాంశంలో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుబేర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న 12వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 84999 60254 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏ, బీ, సీ క్వార్టర్స్ బాధితుల నిరసన

- చంద్రబాబు సర్కార్‌కు బుద్ధి ప్రసాదించాలని ఎన్‌టీఆర్ విగ్రహానికి వినతి



ఎన్‌టీఆర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

కర్నూలు(సెంట్రల్): ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్స్‌లో అనధికారంగా నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించిన నేపథ్యంలో తమకు కొంత సమయం కావాలని కోరుతూ బాధితులు వినూత్నంగా నిరసనకు దిగారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి చంద్రబాబు సర్కార్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ.. ఉన్న ఫలంగా తమను ఖాళీ చేయాలని వేధించడం అన్యాయమన్నారు. తామ గృహాలకు కరెంట్, నీటి సరఫరాను బంద్ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు టిడ్కో గృహాల్లో నివాసాలు ఉన్నాయని, వాటిలోకి ప్రవేశించే వరకు గడువు ఇవ్వాలని కోరారు. ఎవరి కోసమో తమను ఉన్న ఫలంగా ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం అన్యాయమని వాపోయారు. కాగా, వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐద్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాయలసీమ నాయకులు వీవీ నాయుడు తదితరులు మద్దతు తెలిపారు.

కళాకారులకు అభినందన



కళాకారులను సన్మానిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్: జిల్లా కళాకారులు మరిన్ని జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు సాధించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆకాంక్షించారు. సత్యసాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో అనంతపురం టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామ' పద్య నాటకం జాతీయ స్థాయి అవార్డులు సాధించిన నేపథ్యంలో వేర్వేరు కార్యక్రమాల్లో టీజీ వెంకటేష్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెలంగాణ విశ్రాంత ఏడీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి కళాకారులను అభినందించారు. టీజీవీ కళాక్షేత్రం ఇప్పటికే 38 నందులతో పాటు ఎన్నో అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. నాటక దర్శకులు, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నటులు, తదితరులు పాల్గొన్నారు.

15న లేబర్ ఆఫీసు ముట్టడికి పిలుపు



మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న విజయవాడ లేబర్ ఆఫీసు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. బుధవారం గణేష్ నగర్‌లో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి మళ్లించిన రూ.4298 కోట్లను జమ చేయాలని డిమాండ్ చేశారు. సిమెంట్, స్టీలు రేట్లను తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఫుడ్ కమిషన్ సభ్యురాలికి సమస్యలను వివరిస్తున్న అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలిత కోరారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవిని అసోసియేషన్ నేతలు కలిసి వినతి పత్రం అందించారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, కేంద్రాలకు వంట పాత్రలు, ఉచితంగా గ్యాస్‌ను సరఫరా చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ విజయ, అసోసియేషన్ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు షమీనాబాను, ఈఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని బళ్లారి రోడ్డులో ఉన్న అమీలియో హాస్పిటల్‌కు నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఆఫ్ హాస్పిటల్స్ (ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు లభించింది. ఈ మేరకు ఎన్‌ఏబీహెచ్ నుంచి ప్రమాణపత్రం ఆసుపత్రికి వచ్చినట్లు ఎండీ డాక్టర్ సి.లక్ష్మీప్రసాద్ చెప్పారు. ఆసుపత్రి ఆరోగ్య సేవలలో విశిష్టత సాధిస్తూ ఈ ప్రమాణ పత్రం అందుకున్నామని తెలిపారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోనేందుకు ఏడాదికి రూ.60 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వాహనమిత్ర పథకం వెంటనే అమలు చేయాలని, జీఓ నంబర్ 21, 31లను రద్దు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగుతున్నట్లు చెప్పారు. నాయకులు వెంకటేష్, చంద్రోశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యునాని విద్యార్థులకు బంగారు పతకాలు

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన 27, 28వ స్నాతకోత్సవ కార్యక్రమంలో కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మీర్ జైనుల్ అబిదీస్ ఖాస్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన విజయవాడలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమ కళాశాలకు చెందిన డాక్టర్ సమ్రీన్ సుల్తానా (2016 బ్యాచ్), డాక్టర్ ఆరిఫా షేక్ (2017 బ్యాచ్) ప్రతిష్టాత్మకమైన హెచ్‌కె సజ్జాద్ గోల్డ్ మెడల్ అవార్డును రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి బీయుఎంఎస్ పరీక్షల్లో అన్ని దశల్లో ఒకే ప్రయత్నంలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. యునాని రంగంలో అగ్రగామి పండితులను తీర్చిదిద్దడంలో డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కాలేజీ విద్యా ప్రాభవాన్ని ప్రతిబింబిస్తోందని చెప్పారు.

రేపటి నుంచి స్వాముల వారి ఆరాధనోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రంగి కొండలపై వెలసిన ఆది చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వాముల వారి ఆరాధన మహోత్సవం ఈనెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వాముల వారికి సుప్రభాత సేవ, అభిషేకం, గ్రామ దేవతల పూజలు నిర్వహించి, మధ్యాహ్నం విశిష్ట పూజల మధ్య మహా నైవేద్యం సమర్పించి, సాయంత్రం బిందె సేవ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం స్వాముల వారికి ఆకుపూజ, భక్తాదులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్థానిక రాముల దేవాలయం భజన బృందం వారిచే అఖండ భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 13న మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయగలరని వారు కోరారు.

సుఖ వ్యాధులపై అవగాహన

కర్నూలు(రూరల్): మండల పరిధి నందనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో సుఖ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డీఆర్‌పీ నాగరాజు మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ పట్ల యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని నివారణే మార్గమని వివరించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజ్‌లు, పరిక్షింపబడని రక్తం ద్వారా ఎయిడ్స్ సంక్రమిస్తుందని వివరించారు. హెచ్‌ఐవీ పట్ల ఎలాంటి సందేహాలు, అనుమానాలున్నా జాతీయ హెల్ప్‌లైన్ 1097 కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యాక్రమంలో రామసుబ్బారెడ్డి, సత్యవాణి, శశికళ, నాగలక్ష్మి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకునే ముందు ఆలోచించాలి



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్క క్షణం ఆలోచించాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మానసిక వైద్యులు డాక్టర్ చైతన్యతో కలిసి మానసిక ఆరోగ్య సమస్యల బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన అత్యంత ప్రమాదకరమని, దీని నుంచి బయట పడేందుకు మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. తీవ్రస్థాయికి పెరిగిన మానసిక ఒత్తిడి, సంఘర్షణలతో పలువురు ప్రాణాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించాలనుకునే వారి ప్రవర్తన భిన్నంగా ఉంటుందని, ఒంటరిగా ఉండటం, దురలవాట్లు పెంచుకోవడం, నిరాశ, నిస్పృహలతో మాట్లాడటం, జీవితం వ్యర్థమనే బాధలో తమకిష్టమైనవి ఇతరులకు ఇవ్వడం వంటివి చేస్తారన్నారు. ఇలాంటి వారిని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుర్తించి సమస్యల నుంచి బయటపడేలా చేయాలన్నారు. డాక్టర్ పద్మావతి, డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు (టౌన్): సచివాలయ ఉద్యోగులు అలసత్వం వీడండి. ప్రతి సచివాలయం పరిధిలో వంద శాతం పన్ను వసూలు చేయండి. లేకుంటే సస్పెన్షన్ వేటు తప్పదని నగరపాలక కమిషనర్ విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం నగరపాలక నూతన కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి సచివాలయ ఉద్యోగులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా పన్నుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను, నీటి పన్నుల ద్వారా రూ.100 కోట్లు మొండి బకాయిలు ఉన్నాయన్నారు. మొండి బకాయిలు వసూలు చేయడంలో ఎందుకంత నిర్లక్ష్యం అని మండిపడ్డారు. అసలు ప్రతి సచివాలయం పరిధిలో బకాయిల వివరాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. పన్ను వసూళ్లపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, త్వరితగతిన పన్ను వసూళ్లు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ శేషసాయి నెలవారీ సమీక్షలు చేస్తున్నారా అని ప్రశ్నించి ఆయన పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కొళాయి కనెక్షన్లకు మీటర్లను ఎందుకు బిగించడం లేదన్నారు. ఇకపై ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పనిచేస్తూ మొండి బకాయిలు వసూలు చేయాలన్నారు. పని తీరులో ప్రగతి లేని సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఏఈ, డీఈ, ఎంఈ అభివృద్ధి పనులతో పాటు రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్యాంకులను శుభ్రం చేయించండి



మాట్లాడుతున్న అధికారులు

కల్లూరు: గ్రామాల్లోని ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో జీఎస్‌డబ్ల్యూఎస్ సేవల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి ట్యాంకుల వద్ద నీటిని ఎలా పరీక్ష చేయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ హంస నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, జిల్లా కార్యదర్శి సయ్యద్ రఫీ బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఏపీ హంస జిల్లా ప్రచార కార్యదర్శి నాగన్న, కర్నూలు తాలూకా కార్యదర్శి చక్రధర్, మంజునాథ్, సంపత్, రాజేష్, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ఉన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



పెద్దపాడు ఐద్వా కమిటీ సభ్యులతో పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, తరచూ ఎక్కడో ఒకచోట అత్యాచారాలు, హత్యలు, కిడ్నాప్‌లు జరుగుతుండడం బాధాకరమని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల అన్నారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో పెద్దపాడు ఐద్వా మహిళల జనరల్ బాడీ సమావేశం చిలకమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారిస్తోందని, ఫలితంగా మహిళలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నట్లు చెప్పారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చిలకమ్మ, వరలక్ష్మీ, ఉపాధ్యక్షురాలుగా సంటెమ్మ, సావిత్రి, సహాయ కార్యదర్శిగా శాంతమ్మ, కమటీ సభ్యులుగా ఎలిశమ్మ, షమీం, విజయమ్మ ఎన్నికయ్యారు.